క్లుప్తంగా

విద్య విలువైన సంపద



యూనిఫాం అందజేస్తున్న విద్యా కమిటీ చైర్మన్

మిర్యాలగూడ: విద్య విలువైన సంపద అని దామరచర్ల మండలంలోని కల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ధీరావత్ బుజ్జి లింగానాయక్ అన్నారు. బుధవారం పాఠశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీను, ఉపాధ్యాయులు నాగునాయక్, సునీత, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, పి.కరుణ, బాల పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



సదస్సులో పాల్గొన్న షీటీమ్, విద్యార్థులు

మిర్యాలగూడ అర్బన్: విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ ఎస్ఐ ఆర్.కోటేష్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫోక్సోచట్టం, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, మోటార్ వెహికిల్ చట్టం, సైబర్ నేరాలు వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీమ్ పోలీసులు, స్కూల్ ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొనమంచిలి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించకుండా ఓపెన్ టెన్త్, పదో తరగతి ఉత్తీర్ణత సాధించి చదువు మధ్యలో ఆపిన వారు ఓపెన్ ఇంటర్ చదివేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అర్హత గల విద్యార్థులు సెప్టెంబర్ 9లోగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదరు విద్యార్థులు ఆధార్‌కార్డు, రెండు పాస్‌ఫొటోలు, రికార్డ్ షీటు, లేదా టీసీ తీసుకు రావాలని తెలిపారు.

'మా వాటా మాకే' పుస్తకం అవిష్కరణ



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : చట్టసభలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పోరుపై రచయిత గౌరీ శంకర్ రాసిన «మా వాటా మాకే» అనే పుస్తకాన్ని బీసీ జేఏసీ నేతలు మారం శ్రీనివాస్, అన్నభిమోజు నాగార్జునచారి, గుడిపాటి కోటయ్య బుధవారం మిర్యాలగూడలోని శాంతినగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన మా వాటా మాకు వచ్చేంత వరకు బీసీల పోరు ఆగదన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు దాసరాజు జయరాజు, పట్టాభి, పందిరి వేణు, నాగేందర్, లక్ష్మణ్, భీమార్జున్, శోభన్ బాబు, మల్లయ్య ఉన్నారు.

హైకోర్టు ఏజీపీగా డిండి మండల వాసి



పంబాల వేణుగోపాల్

డిండి: మండల పరిధిలోని టి.గౌరారం గ్రామానికి చెందిన పంబాల వెంకటయ్య, కాశమ్మ కుమారుడు వేణుగోపాల్‌ను హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పేద కుటుంబానికి చెందిన వేణుగోపాల్ దేవరకొండలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ, హైదరాబాద్‌లోని ఉస్మానియాలో ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం పూర్తి చేసాడు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న క్రమంలో వేణుగోపాల్‌ను ఏజీపీగా నియమించడంపై అతని తల్లిదండ్రులు, గ్రామస్తులు బుధవారం హర్షం వ్యక్తం చేసారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఫ్రెండ్స్ ఫరెవర్ ఆధ్వర్యంలో యువకులు ఎంపీడీఓ కరుణాకర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ గ్రామంలో మురుగు కాలువలు, పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో దోమలు విపరీతంగా వస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో కుక్కల బెడద కూడా అధికంగా ఉందని, వీధి దీపాలు కూడా వెలగడం లేదని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, సైద య్య, జానీపాష, అనిల్‌కుమార్, వెంకట్, రమేష్, నవీన్ తదితరులున్నారు.

ఎర్రారంలో 18ఏళ్లుగా మద్యనిషేధం

డిండి: మండల పరిధిలో దాదాపు 2800 జనాభా కలిగిన ఎర్రారం గ్రామంలో ప్రజలు చాలా మంది వ్యవసాయంతోపాటు కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తుంటారు. గ్రామానికి సంబంధించిన ఏ విషయమైనా గ్రామసభ ద్వారా ఏకగ్రీవ తీర్మానం చేసుకుని అందుకు కట్టుబడి ఉంటారు. పలు పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవమైన సందర్భాలు ఉన్నాయి. ఇలా ఈ గ్రామ ప్రజలు ఐక్యతతో 18 సంవత్సరాల నుంచి నుంచి మద్యపాన నిషేధం కొనసాగిస్తున్నారు.

గొడవ కారణంగానే..

ఎర్రారంలో 2005 సంవత్సరం మద్యపానం సేవించిన పలువురు వ్యక్తుల మధ్య ప్రారంభమైన గొడవ పోలీసులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. అప్పట్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ బలరాంరెడ్డి గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. మద్యం తాగడం వల్ల గొడవలు జరుగుతాయని, ప్రజల మధ్య మనస్పర్థలు ఏర్పడి సంబంధాలు విచ్ఛిన్నమవుతాయని, ప్రజలు అనారోగ్యానికి గురవుతారనే అంశాలు సమావేశం చర్చకు వచ్చాయి. అదే సమావేశంలో ఎర్రారం గ్రామంలో మద్యపానాన్ని నిషేధిస్తున్నామని గ్రామ ప్రజలంతా ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. నాటి నుంచి ఆ గ్రామంలో మద్యం అమ్మకాలు బంద్ అయ్యాయి. దీంతో గ్రామంలో మద్యం తాగే వారి సంఖ్య క్రమంగా తక్కువైంది. అప్పటి నుంచి గ్రామంలో ఎలాంటి గొడవలకు లేకుండా ప్రజలంతా సంతోషంగా గడుపుతున్నారు.



ఎర్రారం గ్రామ వ్యూ

ఐకమత్యంగా ఉన్నాం



ప్రజలంతా ఐక్యమతంగా ఉండడం వల్లే 18 సంవత్సరాల నుంచి ఎర్రారంలో మద్యపాన నిషేధం కొనసాగుతోంది. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగడం లేదు. ప్రజల మధ్య స్నేహభావం పెరగడంతోపాటు ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు.

– టేకులపల్లి పెదజంగయ్య, ఎర్రారం

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి తనిఖీలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర
- అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశం
- ఆస్పత్రిలో అపరిశుభ్రతపై అసహనం
- శానిటేషన్ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర హెచ్చరించారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వార్డులోకి వెళ్లి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో కలియదిరిగిన ఆయన రోగుల వార్డుల్లో ఉన్న వాష్‌రూంలను చూసి అసహనం వ్యక్తం చేశారు. శానిటేషన్ నిర్వాహకులను పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో ఆస్పత్రి పరిశుభ్రతలో మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాము కాటు, కుక్కకాటు వంటి ఇంజక్షన్లతో పాటు అత్యవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ప్రతి రోజు మానిటరింగ్ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరథ్‌ను ఆదేశించారు. మధ్యాహ్నం తర్వాత ఎక్స్‌రే టెక్నీషియన్ అందుబాటులో ఉండటం లేదని, ఆస్పత్రిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, రోగులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన విలేకరుల మాట్లాడుతూ.. వంద పడకల ఆస్పత్రిలో ప్రస్తుతం 170మంది అడ్మిట్ అయ్యారని, దీంతో పడకలు సరిపోకపోడంతో రోగులను వరండాలో అదనపు బెడ్లు వేశారని తెలిపారు. అదనపు బిల్డింగ్ అసంపూర్తిగా నిలిచిపోయిందని త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి ఆస్పత్రిని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న దృష్ట్యా వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించామని చెప్పారు. మాతాశివు రక్షణలో భాగంగా మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రుల్లో ఇప్పుడున్న బెడ్స్‌కు అదనంగా మరో 16 ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌సమరథ్, డీఈ వెంకన్న, శానిటరి ఇన్స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేత, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలి



హాలియాలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న బీజేపీ, విద్యార్థి సంఘం నాయకులు



త్రిపురారంలో మహనీయుల విగ్రహాల వద్ద జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

హాలియా : జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ ఆవిష్కరించి దేశభక్తిని చాటాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెండె అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. బీజేపీ ఓబీసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రతి ఇంటికి, విద్యార్థులకు బుధవారం జాతీయ జెండాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో త్రివేణి కళాశాల ప్రిన్స్‌పాల్ రమేష్ బాబు, విద్యార్థి పరిషత్ నాయకులు శివమణి, పరమేష్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు అశోక్, జగన్ ఉన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

త్రిపురారం : సమాజంలో ప్రతి ఒక్కరూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేదరి సైదులు అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం ఎన్నెస్పీ క్యాంపు కార్యాలయ ఆవరణలో ఉన్న మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామర్థపు నర్సింహ, కర్ర జానకీరాం రెడ్డి, సిద్ధాంతి కృష్ణ, క్రాంతి పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతను చాటుదాం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ సమైక్యతను చాటుదామని భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెండె అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జాతీయ జెండాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, అఖిల్,ప్రశాంత్, పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

దేవరకొండ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చెర్మన్ ఆలంపల్లి నర్సింహ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రభాకర్, నిరంజన్, భిక్షమయ్య, రాధాకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దేవరకొండ మున్సిపల్ చెర్మన్ నర్సింహ

రైతులకు పట్టాలు ఇప్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ రాధిక

డిండి: మండల కేంద్రంలో భూములు కోల్పోయిన రైతులకు తిరిగి పట్టాలు ఇప్పించాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ ఏటి.రాధికా కృష్ణ బుధవారం హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను మార్గమధ్యలో డిండిలో కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ గతంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యుడిగా తల్లోజు ఆచారి కొనసాగిన సమయంలో రైతులకు పట్టాలు ఇవ్వాలని ఫైనల్ జడ్జిమెంట్ వచ్చినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో గణేష్, రేణయ్య, సాయిగౌడ్, వంశీ,'సురేష్ తదితరులున్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



బెల్టులు, బ్యాడ్జీలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

త్రిపురారం : చదువుకు పేదరికం అడ్డుకాదని వేంపాడు మాజీ సర్పంచ్ అర్వ స్వాతి అశోక్ అన్నారు. బుధవారం నిడమనూరు మండలం వేంపాడు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, అంగన్ వాడీ చిన్నారులకు దుస్తులు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, చిన్నారులకు పౌష్టికాహారం అందేవిధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏడు కొండల్, పాఠశాల చైర్మన్ పోతుగంటి నాగమ్మ, శ్రీనివాస్, రాంబాబు, అశోక్, బాలరాజ్, వెంకట రత్నం, ఏసోబు పాల్గొన్నారు.

పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

హాలియా: సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ కల్లుగీత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చొగాని సీతారాములు అన్నారు. అనుముల మండల కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కాట్నం యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చింతగూడెంలో పాపన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కల్లుగీత వృత్తిలో భాగంగా ఎక్కడ ప్రమాదం జరిగిన ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి కల్లుగీత కార్మికునికి చేయూత పథకం ద్వారా నెలకు రూ 5వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాసాని సత్తయ్య గౌడ్, వడ్డగోని వెంకన్న గౌడ్, కాట్నం సైదులు గౌడ్, కాట్నం నవీన్ గౌడ్, చెదురుబెల్లి రామలింగం గౌడ్, కాకునూరి సైదయ్య గౌడ్, శివ గౌడ్, నరసింహగౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బెల్టులు, బ్యాడ్జీల పంపిణీ

పెద్దవూర: మండలంలోని పులిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తహసీల్దార్ సరోజ పావని దాతలు అందించిన బెల్టులు, బ్యాడ్జీలు, ఐడీ కార్డులను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులచే అత్యుత్తమ విద్య లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం సుదర్శన్, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు మద్దిమడుగు సుష్మ, దాతలు బి.సుధీర్, చిరంజీవి, సత్యనారాయణ, లక్ష్మయ్య, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, పీడీ కూతాటి మురళీ పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి పోరాడుతాం



అభివాదం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పద్మశాలీల సంక్షేమానికి ఉద్యమిస్తామని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (టీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి వల్లకాటి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడకు వచ్చి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు.అనంతరం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న జరగనున్న తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా తనకు (మగ్గం గుర్తు)కు ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో రాపోలు వెంకటేశ్వర్లు, వీరమోహన్, వేముల బాలరాజు, యాదగిరి, అప్పం శ్రీనివాస్‌రావు, కృష్ణవేణి, పున్నా శైలజ, వేముల వెంకన్న, మల్లయ్య, సీతావైద్య కిశోర్, నారాయణ పాల్గొన్నారు.

సాగర్‌లో ఎస్‌పీఎఫ్, సీఆర్‌పీఎఫ్ జవాన్ల ర్యాలీ



సాగర్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జవాన్లు

నాగార్జునసాగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం సాగర్‌డ్యాం సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సాహీర్ అలీ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ కాలనీల్లో సీఆర్‌పీఎఫ్, ఎస్‌పీఎఫ్ బలగాలు జాతీయ జెండాలతో ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. హిల్‌కాలనీ బాలవిహార్ నుంచి సాగర్‌డ్యాం వరకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో సాగర్ సర్కిల్ సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా



వ్యాపారులకు జరిమానా విధిస్తున్న కమిషనర్

హాలియా : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు అమ్మినా..కొనుగోలు చేసినా జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ హెచ్చరించారు. హాలియా మున్సిపాలిటీ కేంద్రంలో పలు దుకాణాల్లో బుధవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న పలు దుకాణాలు, కిరాణం, బేకరి షాపులను గుర్తించి వ్యాపారులకు రూ.13వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలను ఆగస్టు 10లోపు నిలిపివేయాలని గతంలోనే నోటీసులు అందించామన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి దుకాణాల యజమానులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఓ శ్రీధర్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతపల్లి : అనుమతులు లేకుండా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం చింతపల్లి పోలీసులు పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన జనిగల మల్లేష్ చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి మీదుగా టాటాఏస్ వాహనంలో 30 క్వింటాళ్ల రేషన బియ్యాన్ని తరలిస్తున్నాడని సమాచారంతో నిఘాపెట్టి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఉపన్యాస పోటీలో ప్రతిభ

కొండమల్లేపల్లి : మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బొడ్డుపల్లి స్పందన ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం నాగేశ్వర్‌రావునాయక్ తెలిపారు. జిల్లాలోని 33 మండలాలకు చెందిన విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో పాల్గొనగా స్పందన ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వేములపల్లి(మాడ్గులపల్లి): ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యుడు రఫి సూచించారు. బుధవారం మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ గ్రామంలో ప్రజలు విష జ్వరాలతో బాధపడుతుండడంతో వైద్య శిబిరం నిర్వహించి మాట్లాడారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రజిని, సూపర్‌వైజర్ స్టెల్లా, ఎంఎల్‌హెచ్‌పీ జోసఫ్, భవాని, జ్యోతి, పుష్పలత, మౌనిక పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

త్రిపురారం : మండలంలోని బాబుసాయిపేట, పెద్దదేవులపల్లి గ్రామాల్లో బుధవారం బోనాల పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని బొడ్రాయి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు కొత్త కుండలో బోనాన్ని వండుకొని ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆయిల్‌పాం సాగు పరిశీలన

అడవిదేవులపల్లి : మండలంలోని కొత్త నందికొండ గ్రామంలో రైతు యాదగిరి సుమారు 40 ఎకరాల్లో చేపట్టిన ఆయిల్‌పాం సాగును బుధవారం మిర్యాలగూడ డివిజనల్ ఉద్యానవన అధికారిణి నసీమా పరిశీలించారు. ఆయిల్‌సాగులో అంతర్ పంటగా మిర్చి, పత్తి, కందులు, పెసర్లు, సాగు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వివరించారు. ఆమె వెంట ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్, అసిస్టెంట్ ఫీల్డ్ ఆఫీసర్ రాజా ఉన్నారు.

లారీ డ్రైవర్‌పై దాడి చేసి దోపిడీ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు లారీ డ్రైవర్‌పై దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు. టూటౌన్ సీఐ సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి చెన్నైకి ఆయిల్ లోడుతో వెళుతున్న లారీడ్రైవర్ సల్మాన్‌అలీ మిర్యాలగూడలోని ఈదులగూడ జంక్షన్‌లోని ఓ దాబా వద్ద వాహనాన్ని ఆపి టైర్లను చెక్ చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి సల్మాన్ అలీపై దాడికి దిగి అతడి జేబులో ఉన్న డబ్బులను తీసుకున్నారు. అంతటితో ఆగకుండా లారీ డ్రైవర్ ఫోన్‌పే ద్వారా వారి అకౌంట్‌కు రూ.24 వేలను బదిలీ చేయించుకుని పరారయ్యారు. తేరుకున్న లారీడ్రైవర్ సల్మాన్ అలీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

కొండమల్లేపల్లి : కుక్కల దాడిలో ముగ్గురు పదేళ్లలోపు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాలో బుధవారం వెలుగులోకి వచ్చింది. తండాకు చెందిన ఇస్లావత్ నరేష్-ప్రియాంక దంపతుల కుమార్తె తన్విత, సంతు-మంజుల దంపతుల కుమారుడు రాజు, ముఢావత్ కృష్ణ- బుజ్జిల కుమారుడు పవన్‌లు మంగళవారం సాయంత్రం తమ ఇళ్ల ముందు ఆడుకుంటుండగా ఓ కుక్క ఒకరి తర్వాత మరొకరిని కరిచి తీవ్రంగా గాయపర్చింది. గమనించిన తండావాసులు తరమడంతో ఆ కుక్క పరిగెత్తింది. చిన్నారులను తొలుత దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు తండావాసులు తెలిపారు.